## అధ్యాయము 35

# బేతేలుకు తిరుగు ప్రయాణం

యాకోబు జీవితంలో చాలా భాగం ప్రయాణాలే ఉన్నాయి. అతని తల్లి "లేచి," "పారిపోయి" వెళ్లమని చెప్పింది (27:43), అతని తండ్రి అదే మళ్లీ చెబ్తూ "నీవు లేచి పద్దనరాము" (28:2) వెళ్లమన్నాడు. హారానులో ఇరవై సంవత్సరాలున్న తర్వాత, దేవుని దూత అతణ్ణి కనానుకు తిరిగి వెళ్లమని మందలించాడు (31:13). వాక్యభాగంలోని ఈ విభాగంలో, "లేచి" "వెళ్లి" అని యాకోబు దేవునినుండి ఆజ్ఞ నందుకున్నాడు (35:1). బేతేలుకు తిరిగి వెళ్లి తనను ఆరాధించమని ఆయన పితరునితో చెప్పాడు.

అన్యదేవతల్ని విడిచిపెట్టి తమను తాము శుద్ధిచేసుకున్న తర్వాత (35:2-4), యాకోబు పరివారం షెకెము నుండి బేతేలుకు ప్రయాణమయ్యారు. అక్కడ దేవుడు మళ్లీ యాకోబుకు ప్రత్యక్షమై, తన నిబంధనలోని వాగ్దానాల్ని పునఃధృవీకరణ చేశాడు (35:5-15). తర్వాత, ఈ పరివారం బేతేలును విడిచి, హెబ్రోను వైపు దక్షిణానికి ప్రయాణం చేశారు. ఈ ప్రయాణం యాకోబు హృదయానికి పెను విషాదాన్ని మిగిల్చింది. అతని ప్రియపత్ని రాహేలు అతని పన్నెండవ కుమారుడైన బెన్యామీనుకు జన్మనిస్తూ మరణించింది (35:16-21). తర్వాత, యాకోబు పెద్దకుమారుడైన రూబేను తన తండ్రి ఉపపత్నియైన బిల్హాతో వావివరుసల్లేని లైంగిక సంబంధం పెట్టుకున్నాడు (35:22a). తుదకు, యాకోబు తండ్రి ఇస్సాకు హెబ్రోనులో మరణించాడు (35:27-29). ఈ విషాద సంఘటనల నడుమ, యాకోబుకు పెక్కు సంతానాన్నిచ్చిన దేవుని విశ్వాస్యతను వాక్యభాగం రూఢిగా తెలియజేస్తోంది. అతని పండ్రెండుగురు కుమారుల ప్రస్తావన కనబడుతోంది (35:22b-26); ఇశ్రాయేలు జాతి ఆవిర్భావానికి మూలపురుషులు వీరే.

### యాకోబు కుటుంబము యొక్క ప్రతిష్ఠితము:

### అన్యదేవతలన్నిటిని పారవేయుట (35:1-4)

**1దేవుడు యాకోబుతో–నీవు లేచి బేతేలునకు వెళ్లి అక్కడ నివసించి, నీ సహోదరుడైన ఏశావు ఎదుట నుండి నీవు పారిపోయినప్పుడు నీకు కనబడిన**

**దేవునికి అక్కడ బలిపీఠమును కట్టుమని చెప్పగా [2-3]యాకోబు తన యింటివారితోను తనయొద్ద నున్నవారందరితోను –మీ యొద్దనున్న అన్యదేవతలను పారవేసి మిమ్మును మీరు శుచిపరచుకొని మీ వస్త్రములను మార్చుకొనుడి. మనము లేచి బేతేలునకు వెళ్లుదము; నా శ్రమ దినమున నా కుత్తరమిచ్చి నేను వెళ్లిన మార్గమున నాకు తోడైయుండిన దేవునికి బలిపీఠమును అక్కడ కట్టెదనని చెప్పెను. [4]వారు తమయొద్దనున్న అన్యదేవతలన్నిటిని తమ చెవులనున్న పోగులను యాకోబునకు అప్పగింపగా యాకోబు షెకెము దగ్గరనున్న మస్తకి వృక్షము క్రింద వాటిని దాచిపెట్టెను.**

**వచనము 1. యాకోబుకు** బేతేలునొద్ద ప్రత్యక్షమైన **దేవుడు** (28:12-17), మరియొక సారి ఈ విషయాలలో ఆయనకు ఒక సవాలు చేశాడు: "**నీవు లేచి బేతేలునకు వెళ్లి అక్కడ నివసించు.**" బేతేలు అనునది షెకెము కంటే సుమారు ఒక వెయ్యి అడుగుల ఎత్తులో ఉంటుంది, కాబట్టి భౌగోళికముగా చూస్తే "నీవు లేచి" అనే ఆజ్ఞ సరియైనదిగానే ఉంది. దేవుడు ఇంకా, **నీ సహోదరుడైన ఏశావు ఎదుట నుండి నీవు పారిపోయినప్పుడు నీకు కనబడిన దేవునికి అక్కడ బలిపీఠమును కట్టుమని** చెప్పాడు. పితరులు తరచు తమ ప్రయాణాలలో బలిపీఠములను కట్టేవారు (12:7, 8; 13:18; 22:9; 26:25; 33:20), కాని సదరు పితరుడు ఈ విధంగా చేయాలని దేవుడు చెప్పడం నమోదు చేయబడింది ఇక్కడే.[1] సారాంశంగా చెప్పాలంటే, తన సహోదరుడైన ఏశావు ఉగ్రతనుండి తప్పించుకొనుటకుగాను హారానుకు ప్రయాణమై పోతున్నప్పుడు దేవుడు యాకోబుతో చేసిన మతపరమైన ఒక ప్రమాణమును నెరవేర్చాలని జ్ఞాపకము చేయుటకు దేవుడు ఈ ఆజ్ఞ ఇచ్చినట్లుగా అనిపిస్తుంది (28:20-22).

**వచనము 2–3. యాకోబు** ఈ ఆజ్ఞను పొందినప్పుడు వెంటనే తన **యింటివారితో** (భార్యలు, బిడ్డలు మరియు దాసులు) మరియు **తనయొద్ద నున్నవారితో** (బందీలైన విధవరాండ్రు, పిల్లలు మరియు షెకెము నుండి దాసులు) వారి మధ్యనున్న ఎటువంటి **అన్యదేవతలనైనా పారవేయమని** ఆజ్ఞాపించాడు. ఇవి రాహేలు తన తండ్రి యింట నుండి దొంగిలిన "యింటి విగ్రహముల"తో కూడా కలిపి (3:19), ఇంకా తన కుటుంబీకులు కాని తన దాసులు కాని కలిగియున్న ప్రతియొక్క విగ్రహము, అలాగే షెకెము ప్రజలు తమతో తీసుకొచ్చిన ప్రతి విధమైన విగ్రహముతో కలిపి పారవేయవలసి ఉన్నారు. నిజమైన ఒకేఒక్క దేవుని ఆరాధించుటకు గాను అబద్ధ దేవుళ్లను పారవేయడం అనునది ప్రధానమైనదిగా ఉంది, మరియు ఈ నియమము తరువాతి పదిఆజ్ఞలలో ఉద్ఘాటించబడింది (నిర్గమ. 20:3-6; ద్వితీ. 5:7-10; యెహోషువ 24:14; న్యాయాధి. 10:16; 1 సమూ. 7:3, 4 కూడా చూడండి).

తమను తాము **శుచిపరచుకొనమని** కూడా యాకోబు తన ప్రజలతో చెప్పాడు. ఇదియుకూడా యెహోవా యొక్క సన్నిధిలో ప్రవేశించుటకు ముందు

పాటించవలసిన ఒక అగత్యముగా ఉంది (నిర్గమ. 29:4; 30:19-21 చూడండి). శుచిపరచుకొనే క్రమంలో ఆరాధనకు సిద్ధపాటుగా **వస్త్రములను మార్చుకొనుట** కూడా ఉంటుంది (లేవీయ. 6:10, 11; 2 సమూ. 12:20; నిర్గమ. 19:10, 11 చూడండి). అట్టి శుభ్రత అవసరం ఎందుకంటే షెకెములోని మగవారినందరినీ సంహరించి మరియు వారి శవములను దోచుకున్నప్పుడు, యాకోబు దండులో ఉన్న అనేక మంది మృతదేహములతోను మరియు రక్తముతోను అపవిత్రపరచబడ్డారు (సంఖ్యా. 31:19, 20, 24 చూడండి). సంహరించబడినవారి కుటుంబీకులు ఆ మృతులను ముట్టుట ద్వారా ఖచ్చితంగా అపవిత్రులైయుంటారు.

తన అనుచరగణం అంతయు **బేతేలు**నకు వెళ్లి అక్కడ **దేవునికి బలిపీఠమును** కట్టునట్లు యాకోబు వారిని పంపుటకు కారణము దేవుడు ఆయన **శ్రమదినమున** [ఆయనకు] **ఉత్తరమిచ్చాడు** గనుక. ఏశావు నుండి పారిపోతున్నప్పుడు బేతేలు దగ్గర అనేక సంవత్సరాల క్రితం యాకోబు చేసిన ఒక ప్రమాణమును గూర్చి ఆలోచిస్తున్నాడు: ". . . దేవుడు నాకు తోడైయుండి, నేను వెళ్లుచున్న ఈ మార్గములో నన్ను కాపాడి, . . . యెహోవా నాకు దేవుడై యుండును." ఇంకా యాకోబునకు దేవుడిచ్చిన యావత్తులో దేవునికి "పదియవవంతు" చెల్లించెదనని కూడా మ్రొక్కుబడి చేసుకున్నాడు (28:20-22). ఆయన **వెళ్లిన** ప్రతి **మార్గమున** దేవుడు యాకోబుకు తోడైయున్నాడు గనుక, తన మ్రొక్కుబడిని ఇప్పుడు చెల్లించాలని యాకోబు అంటున్నాడు.

**వచనము 4.** పితరునితో ఉన్న దండువారందరూ కూడా [ఆయనకు] **తమయొద్దనున్న అన్యదేవతలన్నిటిని తమ చెవులనున్న పోగులను అప్పగించారు.** చెవిపోగులు అనునవి బహుశా షెకెమును మూటకట్టినప్పుడు యాకోబు కుమారులు తీసుకున్న విలువైన వస్తువులలో భాగములై ఉంటాయి (34:29), మరియు ఆ అన్యజనులకు ఈ వస్తువులు మతపరమైన ప్రాధాన్యత కలిగినవిగా ఉండి ఉంటాయి (న్యాయాధి. 8:24-27; హోషేయ 2:13 చూడండి).

ఆ విగ్రహములను మరియు పోగులను తీసుకున్న తరువాత, **యాకోబు షెకెము దగ్గరనున్న మస్తకి వృక్షము క్రింద వాటిని దాచిపెట్టెను.** ఈ కార్యము బహుశా విగ్రహారాధనతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్న విషయాన్ని సూచిస్తుంది. వారు విగ్రహములను మరియు "వాటి స్థానములో ఉపయోగించు ఎటువంటి పదార్థమునైనా"[2] తమ నుండి దూరంగా పారవేశారు. ఈ పోగులు నిర్గమకాండము 32:2-4లో ప్రోగుచేసిన బంగారు పోగులతో పోతపోసిన దూడను చేసినట్లుగానే బహుశా బంగారముతో చేయబడి ఉంటాయి.

## దైవప్రత్యక్షత మరియు దేవుని వాగ్దానము యొక్క పునఃనిశ్చయత

## (35:5-15)

**5వారు ప్రయాణమై పోయినప్పుడు, దేవునిభయము వారి చుట్టున్న
పట్టణములమీద నుండెను గనుక వారు యాకోబు కుమారులను తరుమలేదు.
6యాకోబును అతనితో నున్న జనులందరును కనానులో లూజుకు, అనగా
బేతేలునకు వచ్చిరి. 7అతడు తన సహోదరుని యెదుట నుండి పారిపోయినప్పుడు
దేవుడక్కడ అతనికి ప్రత్యక్షమాయెను గనుక అక్కడ బలిపీఠమును కట్టి ఆ చోటికి
ఏల్ బేతేలను పేరుపెట్టిరి. 8రిబ్కా దాదియైన దెబోరా చనిపోయి బేతేలునకు
దిగువనున్న సింధూరవృక్షము క్రింద పాతిపెట్టబడెను, దానికి అల్లోను బాకూత్ అను
పేరు పెట్టబడెను.**

**9యాకోబు పద్దనరామునుండి వచ్చుచుండగా దేవుడు తిరిగి అతనికి ప్రత్యక్షమై
అతని నాశీర్వదించెను. 10అప్పుడు దేవుడు అతనితో – నీపేరు యాకోబు;
ఇకమీదట నీపేరు యాకోబు అనబడదు; నీపేరు ఇశ్రాయేలు అని చెప్పి అతనికి
ఇశ్రాయేలు అను పేరుపెట్టెను.**

**11మరియు దేవుడు–నేను సర్వశక్తిగల దేవుడను; నీవు ఫలించి అభివృద్ధి
పొందుము. జనమును జనముల సమూహమును నీవలన కలుగును; రాజులును
నీ గర్భవాసమున పుట్టెదరు. 12నేను అబ్రాహామునకును ఇస్సాకునకును ఇచ్చిన
దేశము నీకిచ్చెదను; నీ తరువాత నీ సంతానమునకు ఈ దేశము నిచ్చెదనని
అతనితో చెప్పెను. 13దేవుడు అతనితో మాటలాడిన స్థలమునుండి పరమునకు
వెళ్లెను. 14ఆయన తనతో మాటలాడినచోట యాకోబు ఒక స్తంభము, అనగా
రాతిస్తంభము కట్టించి దానిమీద పానార్పణము చేసి నూనెయు దానిమీద పోసెను.
15తనతో దేవుడు మాటలాడినచోటికి యాకోబు బేతేలను పేరు పెట్టెను.**

**వచనము 5.** ఆఖరుగా దేవుని ఆజ్ఞకు విధేయులై యాకోబు మరియు ఆయన కుటుంబము షెకెమును విడిచిపెట్టారు. తన కుమారులు షెకెము ప్రజలకు ఏమి చేశారో తెలుసుకున్నప్పుడు కనానీయులు మరియు పెరిజ్జీయులు ఆయనను మరియు ఆయనతో ఉన్నవారందరిపై దాడి చేస్తారని యాకోబు భయపడిపోయాడు (34:30). మానవ కోణంలో ఆలోచిస్తే, చుట్టుప్రక్కల ఉన్న దేశములకు భయపడుటకు పితరునికి సరియైన కారణాలే ఉన్నాయి ఎందుకంటే ఆ సమయములో కనాను దేశములో ఉన్న జనాంగముకంటే తన యొక్క దండులో ఉన్న వారి సంఖ్య చాలా అల్పమైనది. యాకోబు భయపడినప్పటికీ, ఆయనకు చుట్టూ ఉన్న వారి స్పందన ఆయన ఆశించినదానికి విరుద్ధముగా ఉంది. **వారు ప్రయాణమై పోయినప్పుడు, దేవుని భయము వారి చుట్టున్న పట్టణములమీద నుండెను,** గనుక అది వారిని పగతీర్చుకొనకుండా ఆపింది.

మరియొక సారి దేవుడు తన ప్రజలకు దైవికమైన రక్షణను అందిస్తూ నమ్మదగినవాడిగా ఉన్నాడు. ఆ భూమిలో నివశించుచున్నవారు **యాకోబు కుమారులను తరుమలేదు.** దైవిక విమోచనను రుచిచూచిన ఈ అనుభవము కనాను దేశమునకు ప్రవేశించే ముందు దేవుడు ఇశ్రాయేలీయులకు చేసిన వాగ్దానములను ముందుగానే గ్రహిస్తుంది (నిర్గమ. 23:27, 28; ద్వితీ. 7:20-24).

**వచనము 6. యాకోబు** మరియు **అతనితోనున్న జనులందరూ** సమీపించిన పట్టణము యొక్క పాత పేరును ఈ వాక్యభాగము ప్రస్తావిస్తూ వారు **లూజు, అనగా బేతేలునకు** వచ్చారని చెప్తుంది. ఈ సమాచారము 28:19 నుండి పునరావృతము చేయబడింది. ఆ స్థలములో యాకోబునకు దేవునితో కలిగిన పూర్వఅనుభవాలను జ్ఞాప్తికి తెచ్చుటకుగాను రచయిత ఈ ద్వంద్వ పేరుల ప్రస్తావనను ఇక్కడ ఇమిడ్చి ఉంటాడు (28:10-22).

**వచనము 7.** యెహోవా ఆజ్ఞకు విధేయులై (35:1), యాకోబు **అక్కడ బలిపీఠమును కట్టి ఆ స్థలమునకు ఏల్ బేతేలను పేరుపెట్టెను.** ఈ చోటుకు తిరిగి వచ్చినప్పుడు యాకోబు బేతేలు ("దేవుని యిల్లు") అనే పేరును మార్చినందున అది ఏల్ బేతేల్ ("దేవుని యింటికి దేవుడు")గా అయ్యింది. ఈ పేరు మార్పిడి యాకోబు **తన సహోదరుని యెదుట నుండి పారిపోయినప్పుడు అతనికి ప్రత్యక్షమైన దేవుని**పై ఉంచిన నూతన దృష్టిని ప్రతిబింబిస్తుంది. ఆ చోటుకు దానంతట దానిలో ఎటువంటి పరిశుద్ధత లేదని ఆయన గ్రహించగలిగాడు; నిజమైన ఏకైక దేవుని ఆయన మొదటిసారిగా కలుసుకున్న సాధారణ చోటు మాత్రమే అది. ఆయన ప్రయాణము చేసిన స్థలములన్నిటిలో ఆయనకు ప్రత్యక్షమై ఆయనను ఆశీర్వాదిస్తానని యెహోవా యాకోబుకు వాగ్దానము చేశాడు. ఇప్పుడు, అనేక సంవత్సరముల తరువాత, ఈ పితరుడు అనేక విషయాల్లో తప్పిపోయినప్పటికి కూడా దేవుడు తన వాగ్దానములన్నిటిని నెరవేర్చినట్లుగా యాకోబు చూశాడు. ఈ చోటుకు నూతన పేరును ఇవ్వడం అనేది యెహోవాను గూర్చి యాకోబునకున్న జ్ఞానము ఇంకా లోతుగా అవుతుందని చూపుతుంది.

**వచనము 8.** దీనిని అనుసరించి, లేఖికుడు ఇక్కడ ఒక ఆశ్చర్యాన్ని నెలకొల్పే విషయాన్ని ప్రస్తావిస్తున్నాడు. **రిబ్కా దాదియైన దెబోరా చనిపోయి బేతేలునకు దిగువనున్న సింధూరవృక్షము క్రింద**[దక్షిణ భాగాన] **పాతిపెట్టబడెను** అని ఆయన నివేదించాడు. ఆ స్థలమునకు **అల్లోను బాకూత్ అను పేరు పెట్టబడెను**, దీని అర్థము "రోధన ఉన్న సింధూరవృక్షము." ఈ సమాచారమును ఇక్కడ ఇవ్వడం కొంచెం ఆశ్చర్యంగానే ఉంది ఎందుకంటే సుమారు ముప్పది సంవత్సరముల క్రితము యాకోబును హారనుకు పంపిన పిదప రిబ్కా యొక్క పేరు ప్రస్తావించడం ఇదే మొదటి సారి (27:42–28:5; 29:12). ఆదికాండములోని కథనము వదిలిపెట్టకుండా ఖచ్చితంగా ప్రతి పితరుని యొక్క మరణమును మరియు పాతిపెట్టబడుటను గూర్చి మనకు తెలియజేస్తుంది

(25:7-11లో అబ్రాహాము; 35:28, 29లో ఇస్సాకు; మరియు 49:33లో యాకోబు గూర్చి). దీనికి తోడు, ఇద్దరు పితరుల యొక్క ప్రధానమైన భార్యల మరణము మరియు సమాధిని గూర్చిన సమాచారమును ఈ కథనము పొందుపరుస్తుంది (23:1-20లో శారాను గూర్చి మరియు 35:19లో లేయాను గూర్చి). ఈ నియమమునకు రిబ్కా మినహాయింపుగా ఉంది; ఆమెను గూర్చి మరియొక ప్రస్తావన 49:31లో క్లుప్త సారాంశ మాటలో ఉంది. దీనికి కారణము రిబ్కా తనకు ఇష్టుడైన కుమారుని మరలా ఎన్నడూ చూడలేదు. ఆమె మరణించినప్పుడు ఆయన హారానులో ఉన్నట్లుగా ఉన్నాడు కనుక ఆమెను పాతిపెట్టుటలో ఎటువంటి భాగము తీసుకోలేకపోయాడు. యాకోబు కనానుకు తిరిగి వచ్చినప్పటికి తన తల్లి అప్పటికే మరణించి పాతిపెట్టబడింది.

"రిబ్కా దాది" తాను కనాను వెళ్లుటకు హారానును విడచి ఇస్సాకుకు భార్యగా ఉండుటకు రిబ్కా అవతరించిన క్రొత్తపాత్రలో ఆమెకు సహకరించుటకు వచ్చినప్పుడు (24:59పై వ్యాఖ్యలను చూడండి) కథనములో మునుపే పరిచయం చేయబడింది. ఈ దాదియొక్క పేరు "దెబోరా" అనే విషయాన్ని రచయిత 35:8 వరకు దాచాడు. రిబ్కా దాది యొక్క సమాధి కార్యక్రమంలో పాలుపొందుట ద్వారా మరణించిన తన తల్లికి యాకోబు అంజలి ఘటించాడు.

**వచనములు 9, 10. యాకోబు పద్దనరామునుండి** (హారాను నుండి) **వచ్చుచుండగా దేవుడు తిరిగి అతనికి ప్రత్యక్షమై** అనే మాట కొంచెం ప్రశ్నార్థకంగానే ఉంది. దేవుడు షెకెములో పితరునితో మాట్లాడిన తరువాత (35:1) బహుశా రెండవ సారి ప్రత్యక్షమైనట్లుగా ఈ వాక్యం సూచిస్తుంది. బహుశా అనేక సంవత్సరాల క్రితం బేతేలులో మొదటిసారి ప్రత్యక్షమైన దానిని పోలినదిగా ఈ సందర్భం అగుపడుతుంది (28:10-17). ఏమైనప్పటికీ ఈ సందర్భంలో దేవుడు మునుపు యాకోబుతో చెప్పిన దానిని పునరుద్ఘాటించాడు, కొంత కలిపాడు మరియు ముగించాడు. మొదటిగా, **అతని నాశీర్వదించి,** ఆయన **పేరు యాకోబు** అయినప్పటికీ ఇకపై ఆలాగు **అనబడదు** అని పునరుద్ఘాటించాడు. దీనికి బదులుగా దేవుడు ఆయనను **ఇశ్రాయేలు** అని పిలిచాడు, ఈ పేరు మార్పుపొందిన మనిషికి తగినదిగా ఉంది (32:28). తన కృపద్వారా దేవుడు యాకోబును వదిలిపెట్టలేదు అని ఇది వెల్లడి చేస్తుంది; మరియు వారికి ఇస్తానని దేవుడు వాగ్దానము చేసిన దేశములో ఆయన సంతానమును ప్రజలు "ఇశ్రాయేలు" (యెహోషువ 3:17; 8:24; 13:6) లేదా "ఇశ్రాయేలీయులు" (1 సమూ. 2:14; 14:21; 29:1) అని పిలిచే సమయమును ఇది ముందుగానే గ్రహిస్తుంది.

**వచనములు 11–13.** దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనను పునరుద్ధరిస్తూ యాకోబునకు అధిక ఆశీర్వాదములను కలిపాడు. **సర్వశక్తిగల దేవుని**గా (17:1, 2 చూడండి) తనను తాను గుర్తించుకొని పితరునికి **ఫలించి అభివృద్ధి పొందుము** అని దేవుడు ఆజ్ఞాపించాడు. ఆదాము మరియు హవ్వలకు ఇవ్వబడింది (1:28), నోవహు మరియు అతని కుమారులకు పునరావృతం

చేయబడింది (9:1) మరియు తన చిన్న కుమారుని హారానుకు పంపే ముందు ఇస్సాకు పలికిన (28:1-3) ఆజ్ఞ కూడా ఇదే. యాకోబుకు ఇప్పటికే పదకొండు మంది కుమారులు మరియు ఒక కుమార్తె ఉన్నది, ఇంకా రాహేలు త్వరలో బెన్యామీనుకు జన్మనివ్వబోతోంది (35:16-19) కాబట్టి ఈ ఆజ్ఞ ఇక్కడి సందర్భానికి అతికినట్లుగా లేదు. మరొక సారి, దేవుని యొక్క పలుకు యాకోబు కుమారులు మరియు ఆయన సంతతివారు పొందబోయే ఫలాభివృద్ధిని ముందుగానే గ్రహిస్తున్నట్లుగా ఉంది. ఒక కాలంలో, వారు **జనమును జనముల సమూహమును** [ఆయన] **వలన కలుగును** (35:11; 17:4-6, 16 చూడండి). ఆఖరుగా, దేవుడు **అబ్రాహాము మరియు ఇస్సాకు**కు వాగ్దానము చేసిన **దేశము**ను యాకోబు మరియు ఆయన **తరువాతి సంతానమునకు**ను ఇచ్చెదనని ఇప్పుడు ఆయనతో ప్రతిజ్ఞ చేస్తున్నాడు (35:12; మరియు, 17:7, 8; 26:3; 28:4 చూడండి). ఆ తరువాత, 17:22లో దేవుడు అబ్రాహాము నుండి "పరమునకు వెళ్లిన"ట్లుగానే, యాకోబుతో మాటలాడుట చాలించిన తరువాత **దేవుడు పరమునకు వెళ్లెను** (35:13).

**వచనము 14.** బేతేలు వద్దకు మొదటిసారి వచ్చినప్పుడు, **యాకోబు** ఒక బలిపీఠమును కట్టాడు (35:1, 7). ఇప్పుడు, దేవుని ప్రత్యక్షతకు స్పందనగా, **దేవుడు తనతో మాటలాడినచోట యాకోబు ఒక స్తంభము, అనగా రాతిస్తంభము కట్టించెను.** అప్పుడు యాకోబు ఆ రాతి స్తంభముపై **పానార్పణము చేసి నూనెయు దానిమీద పోసి** దానిని ప్రతిష్ఠపరచాడు. ఆదికాండములో పానార్పణమునకు గల ఏకైక ప్రస్తావన ఇది, కాని తరువాతి ఇశ్రాయేలీ ఆరాధనలో ఇది సాధారణ భాగంగా మారింది (నిర్గమ. 29:40, 41; లేవీయ. 23:13; సంఖ్యా. 4:7; 6:15; 15:5). పానార్పణముతో పాటు యాకోబు ఆ రాతి స్తంభముపై **నూనె పోయుట** ద్వారా దానిని ప్రతిష్ఠితపరచాడు (28:18 చూడండి).

**వచనము 15.** దేవుని యొక్క ప్రత్యక్షత పితరుని కదిలించింది; ఈ సందర్భంలో బేతేలును "భయంకరము" అయినదిగా చెప్పకపోయినప్పటికీ (28:17 చూడండి), ఖచ్చితంగా దానిని అలానే భావించి ఉంటాడు. సారాంశ మాటలో, **తనతో దేవుడు మాటలాడినచోటికి యాకోబు బేతేలను పేరు పెట్టెను** అని వాక్యం చెప్తుంది. ఆ ప్రాంతంలో నివశించే వారికి చాలా సంవత్సరాల క్రితము యాకోబునకు అక్కడ కలిగిన అనుభవమును గూర్చి తెలియదు మరియు దాని పేరును యాకోబు బేతేలుగా మార్చాడు అనే విషయము బహుశా వారికి తెలియక ఉండి ఉంటుంది గనుక ఆ రాతి స్తంభమును అభిషేకించడం మరియు ఆ స్థలమునకు పేరు మార్చడం అనేవి పితరునికి చాలా ప్రాముఖ్యం. ఇంకా, యాకోబు మొదటి సారి దేవుని కలుసుకున్నప్పుడు తన భార్యలు మరియు బిడ్డలు లేరు గనుక ఈ దైవ ప్రత్యక్షత యొక్క ప్రాముఖ్యతను వారు గ్రహింపలేకయే ఉన్నారు. తన సహోదరుని నుండి ప్రాణ హాని చేత తన ప్రాణమును దక్కించుకొనుటకు పారిపోవుతున్న యౌవనుడిగా ఆయన హారాను వెళ్లుటకు దేవుడు తనతో ఉండి

తన ప్రయాణంలో తనకు సహాయము చేస్తాడు అనే దైవ వాగ్దానము తప్ప ఏమియు లేనివాడిగా బేతేలును విడచాడు. ఆయన ఒక పూర్తి వృత్తాన్ని తిరిగి, దైవిక వాగ్దానములు తన జీవితములో సమృద్ధిగా నేరవేర్చబడినవాడై, ఆ దైవికమైన వాగ్దానములు చేయబడిన స్థలమునకే మరలా వచ్చాడు. ఇదంతయు కూడా అతనికి మరియు అతని కుటుంబమునకు నిజముగా అది బేతేలు, "దేవుని యిల్లు," అనే విషయాన్ని నిశ్చయపరచాయి.

## బేతేలు అనంతర పరిణామము (35:16-29)

### బెన్యామీనుకు జన్మనిస్తుండగా రాహేలు మృతిబొందుట (35:16-21)

**[16]వారు బేతేలునుండి ప్రయాణమై పోయిరి. ఎఫ్రాతాకు వెళ్లు మార్గములో మరికొంత దూరము ఉన్నప్పుడు రాహేలు ప్రసవించుచు ప్రసవవేదనతో ప్రయాసపడెను. [17]ఆమె ప్రసవమువలన ప్రయాసపడుచున్నప్పుడు మంత్రసాని ఆమెతో–భయపడకుము; ఇదియు నీకు కుమారుడగునని చెప్పెను. [18]ఆమె మృతిబొందెను; ప్రాణము పోవుచుండగా ఆమె–అతని పేరు బెనోని అనెను; అతని తండ్రి అతనికి బెన్యామీను అను పేరు పెట్టెను. [19]అట్లు రాహేలు మృతిబొంది బేత్లెహేమను ఎఫ్రాతామార్గమున పాతి పెట్టబడెను. [20]యాకోబు ఆమె సమాధిమీద ఒక స్తంభము కట్టించెను. అది నేటి వరకు రాహేలు సమాధి స్తంభము. [21]ఇశ్రాయేలు ప్రయాణమైపోయి మిగ్దల్ ఏదెరు కవతల తన గుడారము వేసెను.**

**వచనము 16.** **బేతేలు**ను విడచిన తరువాత యాకోబు మరియు ఆయన కుటుంబము దక్షిణ దిశగా **ఎఫ్రాతా**కు, లేదా "బేత్లెహేము"నకు వెళ్లిరి (35:19). వారు సహజంగా బేతేలు నుండి హెబ్రోను వరకు ఉన్న, ఇస్సాకు జీవించిన (35:27), పర్వత ప్రాంత మార్గము గుండా ఉత్తర/దక్షిణ మార్గమును అనుసరించి వెళ్లారు. బెన్యామీనుకు **రాహేలు ప్రసవించుచు ప్రసవవేదనతో ప్రయాసపడుతున్నప్పుడు** వారు ఎఫ్రాతా దిశగా ఎంత దూరం ప్రయాణించారో వాక్యము బయలుపరచుట లేదు; కాని, వారు ఆ స్థలము నుండి ఇంకా **మరికొంత దూరములో ఉన్నప్పుడు** ఇది జరిగింది (48:7). తరువాతి వాక్య భాగమొకటి ఈ స్థలమును బెన్యామీను గోత్రమునకు ఇవ్వబడిన సీమలో ఉన్న సెల్సహుగా గుర్తిస్తుంది (1 సమూ. 10:2).[3] కాబట్టి, కడకు తన పేరునే పెట్టుకున్న ప్రదేశములో/సీమలో బెన్యామీను జన్మించాడు. సెల్సహు బహుశా రామా దగ్గర ఉండి ఉంటుంది (యిర్మీయా 31:15), ఇది యెరూషలేముకు ఉత్తరాన సుమారు ఐదు మైళ్ల దూరంలో ఉంది.

యాకోబు కుటుంబము ప్రయాణిస్తుండగా, రాహేలు **ప్రసవవేదనతో** ప్రయాసపడుతుంది. ప్రాచీన కాలములలో గర్భధారణ చాలా కష్టంగా ఉండేది, మరియు గార్ధభముమీదనో లేక ఒంటెమీదనో కూర్చుని ఊగిసలాడటం తల్లికి కొంత అసౌకార్యాన్ని కలిగించడం మాత్రమే కాక జనన విధానాన్ని సంక్లిష్టము చేసేది.

**వచనము 17.** రాహేలు **ప్రసవమువలన ప్రయాసపడుచున్నప్పుడు మంత్రసాని ఆమెతో–భయపడకుము; ఇదియు నీకు కుమారుడగునని చెప్పి** ఓదార్చడానికి ప్రయత్నించింది (30:24పై వ్యాఖ్యలను చూడండి). ప్రసవము ఆరంభంలోనే శిశువుయొక్క లింగాన్ని నిర్థారణ చేయగల సామర్థ్యం శిశువు ఒకవేళ అడ్డంగా తిరిగి జన్మించాడా అనే విషయాన్ని సూచిస్తుంది.

**వచనము 18.** ఈ ప్రక్రియ ఎంత కష్టమైనది అంటే అది రాహేలును మరణము వరకు తెచ్చింది; **ఆమె మృతిబొందెను; ప్రాణము పోవుచుండగా ఆమె–అతని పేరు బెనోని అనెను,** దానికి అర్థము "నా దుఃఖ పుత్రుడు."[4] అయినను, **అతని తండ్రి** తనకు ఇష్టురాలైన భార్య యొక్క కడసరి కుమారునికి పేరు పేరు కలిగి ఉన్నాడు. ఆయన **అతనికి బెన్యామీను అను పేరు పెట్టెను**, ఇది "కుడిచేతి పుత్రుడు"[5] అనే అర్థాన్ని ఇస్తుంది. హెబ్రీ ఆలోచనలో కుడిచేయి అనేది బలము మరియు గౌరవమునకు ప్రతీకగా ఉండేది గనుక ఎక్కువగా ఇష్టపడేవారు. ఈ సందర్భంలో, యాకోబు బెన్యామీనుపై "ఆదరణ మరియు ఆధారం కొరకు" ఆధారపడతాడని "లేదా కుటుంబ భవిష్యత్తు కొరకు మంచి అదృష్టాన్ని కలిగించే కుమారుని యొక్క పుట్టుక ఇది (బెన్యామీను పుట్టుక)"[6] అని తెలుస్తుంది. తన తండ్రిచే నామకరణం చేయబడిన ఒకే ఒక బిడ్డ బెన్యామీను.

**వచనము 19.** యాకోబు దెబోరా యొక్క ఎడబాటును, తన తల్లి దాది యొక్క ఎడబాటును (35:8) అనుభవించాడు, ఇప్పుడు మరొక మరణాన్ని ఎదుర్కొంటున్నాడు. తనకు ప్రియ భార్యయైన **రాహేలు మృతిబొందెను;** మరియు తన శరీరమును **బేత్లెహేమను ఎఫ్రాతామార్గమున పాతి పెట్టెను.** షెకెము మనుషుల యొక్క హత్య, దెబోరా యొక్క సమాధి తరువాత, రాహేలు యొక్క మరణము ఈ పితరుడు అనుభవించవలసిన అధికమైన భారములలో మరొక విషాదముగా ఉంది (48:7). విచారకరమైన ఒక వ్యంగ్యాన్ని కూడా ఇక్కడ మనం చూడగలం: ఒకవేళ తాను పిల్లలను కనలేకపోతే చనిపోతానని రాహేలు ఒకసారి చెప్పింది (30:1), కాని ఇప్పుడు తాను ఎన్నో సంవత్సరాలుగా ఆశించిన తన రెండవ కుమారునికి జన్మనిస్తూనే మరణించింది (30:22-24).

**వచనము 20.** రాహేలును స్మారకము చేసుకొనుటకు, **యాకోబు ఆమె సమాధిమీద ఒక స్తంభము కట్టించెను**; మరియు **ఆ నేటి వరకు రాహేలు సమాధి స్తంభమును** నేటికిని చూడవచ్చునని ఆదికాండము యొక్క రచయిత అంటున్నాడు.

**వచనము 21.** ఈ విచారకరమైన అనుభవము తరువాత **ఇశ్రాయేలు** (యాకోబు) **ప్రయాణమైపోయి మిగ్దల్ ఏదెరు కవతల తన గుడారము వేసెను.**

מִגְדַּל־עֵדֶר (*migdal ʻeder*) అనే హెబ్రీ మాట "మంద యొక్క గోపురము" లేదా "ఏదెరు గోపురము" అనే అర్థాన్ని ఇస్తుంది. లేఖనములలో ఈ ప్రస్తావన మరొక్క సారిమాత్రమే కనబడేది మీకా 4:8లో, "సీయోను కుమార్తె పర్వతము [עֹפֶל, *ʻopel*]" అనే పదమునకు పోలిన పదముగా ప్రయోగించబడింది. "ఓఫెలు పర్వతము" అనునది యెరూషలేము యొక్క దక్షిణ విస్తరణ, మరియు ఈ పట్టణములో ఉన్న పర్వతమునకు "సీయోను" అనునది మరొక పేరు అయి ఉంటుంది. కొన్ని సార్లు యెరూషలేము కూడా "సీయోను" అని సాధారణంగా పిలువబడేది. తరువాతి కాలంలో "బెన్యామీను" అనే పేరుతో చెలామణి అయ్యిన ప్రదేశములో రాహేలు దేహమును పాతిపెట్టిన తరువాత, యాకోబు తన ప్రయాణమును దక్షిణ దిశగా కొనసాగించి యెరూషలేమునకు దాటి దక్షిణ ప్రాంతంలో వారి గుడారములను వేసుకున్నారు.

## యాకోబు ఉపపత్నితో రూబేను యొక్క అగమ్యాగమనము (35:22)

**22ఇశ్రాయేలు ఆ దేశములో నివసించుచున్నప్పుడు రూబేను వెళ్లి తన తండ్రి ఉపపత్నియైన బిల్హాతో శయనించెను; ఆ సంగతి ఇశ్రాయేలునకు వినబడెను.**

**వచనము 22.** (మునుపు యాకోబుగా పిలువబడిన) **ఇశ్రాయేలు** యెరూషలేమునకు దక్షిణ **దేశములో నివసించుచున్నప్పుడు రూబేను వెళ్లి తన తండ్రి ఉపపత్నియైన బిల్హాతో శయనించెను.** ఈ విధంగా చేయుటకు కారణములను వాక్యము బయలుపరచుటలేదు కాని, అనేక సాధ్యాపసాధ్యాలు సూచించబడ్డాయి. మొదటిగా, యాకోబునకు జ్యేష్ఠకుమారుడైన రూబేను మోహముతో నిండి ఉంటాడు. అవకాశమును ఆసరాగా తీసుకుని ఆమెతో వ్యభిచారము చేశాడు.

రెండవ ఆలోచన ఏమనగా తన తల్లియైన లేయా కాకుండా రాహేలు తన తండ్రికి ఇష్టురాలైన భార్య అనే విషయాన్ని రూబేను గట్టిగా వ్యతిరేకించాడు (29:30-32 చూడండి). కాబట్టి, రాహేలు చనిపోయిన తరువాత, తన స్థానమునకు రాహేలు యొక్క దాసియైన బిల్హా కాకుండా లేయా ఎత్తబడాలని ఆశించాడు. పరిశుద్ధ గ్రంథపు కాలములలో, ఒక పురుషునిచే అపవిత్రపరచబడిన తరువాత ఆ స్త్రీతో తన భర్త మరెన్నటికీ లైంగిక సంబంధములు పెట్టుకోడు. ఇదే కోణంలో, రూబేను చేసిన అగమ్యాగమనము యొక్క ప్రభావము ఏమంటే యాకోబు మరెన్నడును బిల్హాతో దాంపత్యం చేయనియ్యకుండా ఉండడమే.

మూడవ మరియు అత్యంత హేతుబద్ధమైన ఆలోచన ఏమంటే రూబేను తన తండ్రికి మించిన అధికారమును చాటుకుంటున్నాడు. పరిశుద్ధ గ్రంథ చరిత్రలో, ఎవరైనా రాజును ఓడించి రాజ్యమును స్వాధీనపరచుకోవాలనుకుంటే సదరు రాజు యొక్క భార్యతో బలవంతంగా సంభోగం చేయడం అనునది ఆనవాయితి (2 సమూ. 3:6-8; 12:18, 11; 16:21, 22; 20:3; 1 రాజులు 2:22; 20:3-7

చూడండి). ఇట్టి కార్యములు చరిత్రలో చాలా పూర్వమునకు చెందినవిగా ఉన్నాయి – ఇశ్రాయేలులో రాజ వ్యవస్థ ప్రారంభించుటకు మునుపు ఉన్నట్లుగా ఉన్నాయి. మోషే ఇచ్చిన ధర్మశాస్త్రములో తన "తండ్రి భార్యతో" మానచ్ఛాదనము చేసిన కుమారునికి దైవిక స్పందన ఏమనగా అట్టివాడు ప్రజలలో నుండి కొట్టివేయబడునట్లుగా ఆజ్ఞాపించబడింది (లేవీయ. 18:8; 20:11; ద్వితీ. 27:20). "తండ్రి భార్య" అనే మాట తండ్రి యొక్క ఉపపత్నిని లేదా మారుడు తల్లిని సూచిస్తుంది కాని సదరు కుమారుని యొక్క సొంత తల్లిని కాదు (1 కొరింథీ. 5:1 చూడండి).

సంవత్సరాలు గడిచిన కొలదీ, తనను స్పందించుటకు ప్రేరేపించు అనేక విషయములలో యాకోబు చాలా నిశ్చేష్టుడిగా మారాడు. షెకెము ద్వారా దీనా బలాత్కారము చేయబడినప్పుడు (34:5) మరియు రూబేను బిల్హాతో శయనించినప్పుడు ఆయన ఇలానే ఉన్నాడు. తరువాతి సందర్భంలో, **ఆ సంగతి ఇశ్రాయేలునకు వినబడినప్పటికీ**, తన జ్యేష్ఠ కుమారుని శిక్షించుటకు యాకోబు ఏమియు చేయలేదు. అయినప్పటికీ, తన జీవితపు ఆఖరి సమయములో తన మంచము మీదకెక్కి దానిని అపవిత్రపరచినందుకు పితరుడు రూబేనును గద్దించాడు (49:4). 1 దినవృత్తాంతములు 5:1 ప్రకారము రూబేను చేసిన ఈ కార్యము ద్వారా తన జన్మ స్వాతంత్ర్యమును కోల్పోయాడు.

## యాకోబు యొక్క కుమారులు (35:23-26)

**23యాకోబు కుమారులు పండ్రెండ్రుగురు. యాకోబు జ్యేష్ఠకుమారుడు రూబేను, షిమ్యోను, లేవి, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను; వీరు లేయా కుమారులు.**
**24రాహేలు కుమారులు యోసేపు, బెన్యామీను. 25రాహేలు దాసియైన బిల్హా**
**కుమారులు దాను, నప్తాలి. 26లేయా దాసియైన జిల్పా కుమారులు గాదు, ఆషేరు వీరు పద్దనరాములో యాకోబునకు పుట్టిన కుమారులు.**

**వచనములు 23–26.** వచనములు 16 నుండి 18 యాకోబు కనిష్ట కుమారుని యొక్క జనన ఉదంతాన్ని తెలుపుతుండగా, 22 వచనము తన జ్యేష్ఠుని వ్యభిచారమును గూర్చి తెలుపుతుంది. ఇక్కడ వచ్చే భాగము (35:23-26) తన నలుగురు భార్యల ద్వారా కలిగిన **యాకోబు కుమారుల**[7] సారాంశాన్ని ఇస్తుంది. మొదటిగా కథకుడు ప్రధాన భార్యలు మరియు వారి సంతానమును తెలిపాడు: **యాకోబు జ్యేష్ఠకుమారుడు రూబేను, షిమ్యోను, లేవి, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను; వీరు లేయా కుమారులు. రాహేలు కుమారులు యోసేపు, బెన్యామీను.** వీరి తరువాత ఉపపత్నుల సంతానమును గూర్చి తెలుపుతున్నారు: **రాహేలు దాసియైన**

**బిల్హా కుమారులు దాను, నఫ్తాలి. లేయా దాసియైన జిల్పా కుమారులు గాదు, ఆషేరు.** ఆ తరువాత ఒక సారాంశ వాక్యము ఇవ్వబడింది: **వీరు పద్దనరాములో యాకోబునకు పుట్టిన కుమారులు.** ఈ మాటకు బెన్యామీను ఒక్కడే మినహాయింపు, ఎందుంకంటే ఆయన (పద్దనరాములోని) హారానులో కాక కనానులో జన్మించాడు (35:16-18). సుస్పష్టంగా ఈ వ్యాఖ్య ఖచ్చితంగా ఇవ్వబడినట్లుగా భావించాలని కాదు, కాని దరిదాపుగా తన కుటుంబీకులనందరిని ఒకటిగా కలుపుతూ చేయబడిన ఒక సాధారణ వ్యాఖ్యగా ఉంది. మరియు ఈ జాబితాలో దీనా ప్రస్తావించబడలేదు ఎందుకనగా ఈ విధమైన వంశావళులలో ఆడువారు ప్రస్తావించబడేవారు కాదు. ఆమె యొక్క సంతానము, ఒకవేళ ఆమెకు కలిగి ఉంటే,[8] కనాను దేశమును స్వతంత్రించుకున్న ఇశ్రాయేలు గోత్రములలో లెక్కించబడలేదు. పాత నిబంధనలో, దీనాలాంటి ఒక యౌవన స్త్రీ వివాహము చేసుకున్నప్పుడు ఆమె బిడ్డలు ఆమె తండ్రి నుండి కాక ఆమె భర్త నుండే వారసత్వమును పొందుకొనేవారు.

## ఇస్సాకు యొక్క మరణము (35:27-29)

**27అబ్రాహామును ఇస్సాకును పరదేశులైయుండిన మమ్రేలో కిర్య తర్బాకు తన తండ్రియైన ఇస్సాకు నొద్దకు యాకోబు వచ్చెను. అదే హెబ్రోను.**
**28ఇస్సాకు బ్రదికిన దినములు నూట ఎనుబది సంవత్సరములు. 29ఇస్సాకు కాలము నిండిన వృద్ధుడై ప్రాణము విడిచి మృతిబొంది తన పితరుల యొద్దకు చేర్చబడెను. అతని కుమారులైన ఏశావు యాకోబులు అతని పాతిపెట్టిరి.**

**వచనము 27.** ఆఖరుకి, చాలా సంవత్సరాల తరువాత, **అబ్రాహామును ఇస్సాకును పరదేశులైయుండిన మమ్రేలో కిర్య తర్బాకు తన తండ్రియైన ఇస్సాకు నొద్దకు యాకోబు వచ్చెను. అదే హెబ్రోను.** ఆయన తల్లి మరియు తన దాది కూడా మృతిచెందారు; యాకోబు ఇంటిని విడచి వెళ్లినప్పుడు (28:10) ఇస్సాకు కాపురముండిన బెయేర్షెబా నుండి ఉత్తరానికి ఆయన కదిలాడు. సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన పునఃకలయిక ఆఖరుకు చోటుచేసుకుంది, మరియు యాకోబును సురక్షితముగా తన తండ్రి యింటికి తిరిగి రప్పిస్తానని దేవుడు చేసిన వాగ్దానమును ఇది ముగించింది (28:15, 21).

**వచనము 28.** ఈ సమయమునకు, **ఇస్సాకు** చాలా వృద్ధుడైయున్నాడు (27:1, 2 వచనములపై వ్యాఖ్యలను చూడండి). 180 సంవత్సరముల వయసులో ఇస్సాకును మరణము కబళించిన సమయమునకు వీరిద్దరూ కలిసి ఎంత

సమయమును గడిపారో అనే విషయంపై వాక్యము ఏమియు చెప్పడం లేదు.

**వచనము 29. ఇస్సాకు ప్రాణము విడిచి మృతిబొంది తన పితరుల యొద్దకు చేర్చబడెను** అని మాత్రం ఇక్కడి నివేదిక ముగిస్తుంది. తన మరణ సమయము సమీపిస్తుండగా దేవుడు మోషేతో చెప్పిన మాటలు కూడా ఈ వ్యాఖ్యలలోని ఆఖరు మాటలను పోలినవిగానే ఉన్నాయి: "ఇదిగో నీవు నీ పితరులతో పండుకొనబోవుచున్నావు" (ద్వితీ. 31:16). ఈ సందర్భంలో, ఇస్సాకు అప్పటికే మరణించి ఉన్నాడు; కాబట్టి ఆయన "తన పితరుల యొద్దకు చేర్చబడెను" అని మామూలుగా వాక్యము చెప్తుంది. ఈ రెండు ప్రకటనలు కూడా మరణమును సూచిస్తున్న జాతీయములే. సారాంశంలో, తాను మరణించినప్పుడు **ఇస్సాకు కాలము నిండిన వృద్ధుడై** అనే మాటను వాక్యము కలుపుతుంది. తండ్రి యొక్క మరణము కుమారులందరినీ ఒక చోటికి తీసుకొస్తుంది, అలాగే ఈ తరములోని ఇద్దరు సహోదరుల విషయంలో కూడా ఇదే జరిగింది: **ఏశావు మరియు యాకోబులు** వచ్చి ఇస్సాకు యొక్క శరీరమును **పాతిపెట్టిరి.** 35:29లో ప్రయోగించబడిన భాష మునుపు అబ్రాహాము మరణము మరియు సమాధిని గూర్చిన వివరణలో ప్రయోగించబడిన భాషకు పోలినదిగా ఉంది (25:7-10పై వ్యాఖ్యలను చూడండి). తరువాతి కథనము ఒకటి ఇస్సాకు హెబ్రోను దగ్గర నున్న మక్పేలా అనే గుహలో పాతిపెట్టబడ్డాడు అని స్పష్టత ఇస్తుంది (49:29-32).

# అన్వయము

## దేవునితో చేసిన ప్రమాణము నెరవేర్చుట (35:1-15)

*Back to the Future* అనే ఒక చలనచిత్రంలో ప్రధాన పాత్రకారుడు ఒకరు, కొన్ని సంఘటనల వరుసను మార్చుకొని తనకొరకు, తన కుటుంబము కొరకు, మరియు తన స్నేహితుని కొరకు ఒక శ్రేష్టమైన భవిష్యత్తును సృష్టించుకొనుటకుగాను గతములోనికి వెళ్లతాడు. ఒక విధంగా, యాకోబు తన మనస్సులో గతములోనికి వెళ్లి తన సహోదరుడైన ఏశావు యొక్క ఉగ్రత నుండి పారిపోవుతున్నప్పుడు బేతేలు దగ్గర దేవుని మొదటిసారి ఎదుర్కొన్న విధానమును జ్ఞాపకము చేసుకొనవలసి వచ్చింది. అబ్రాహాము మరియు ఇస్సాకులకు సంతానముగా యాకోబు మరియు అతని కుటుంబము వారు దేవుడు వారికి వాగ్దానము చేసిన భవిష్యత్తును అనుభవించాలి అనుకున్నట్లయితే (28:12-15), ఆ సందర్భంలో యాకోబు దేవునితో చేసిన ఒక ప్రమాణమును నెరవేర్చవలసిన అవసరత ఎంతైనా ఉంది (28:20-22).

*దేవునికి సమర్పించుకొనుట.* దేవుని ప్రజలు దేవునితో చేసుకున్న ఆత్మీయ తీర్మానములు జ్ఞాపకము చేయబడవలసినవారిగా ఉన్నారు. బాధ్యతలను మర్చిపోవడం అనేది మానవుని నైజం, అది అనుదిన జీవితంలోని సహజ

రంగములోనైనా కావచ్చు, లేదా దేవునితో చేసుకున్న ప్రమాణముల విషయమైన ఆత్మీయ రంగాములోనైనా కావచ్చు. ఏశావు ఉగ్రతనుండి తప్పించుకొనుటకు యాకోబు పారిపోయినప్పుడు, దేవుడు ఆయనకు బేతేలులో ప్రత్యక్షమై ఆయనతో ఉంటానని, అనేకమైన సంతానముతో ఆశీర్వదిస్తానని, పోషిస్తానని మరియు కనాను దేశమునకు ఆయనను సురక్షితముగా తిరిగి తీసుకువస్తానని వాగ్దానము చేసాడు (28:13-15). దేవుని వాగ్దానములకు స్పందిస్తూ యాకోబు తన జీవితమును మరియు తనకు ఇయ్యబడిన యావత్తులో పదియవ వంతును, ఒకవేళ దేవుడు ఆ వాగ్దానములను నెరవేరిస్తే యెహోవాకు అర్పిస్తానని ప్రమాణము చేసుకున్నాడు (28:20-22). చాలా సంవత్సరముల తరువాత, యాకోబు ఇంకను హారానులోనే ఉన్నప్పుడు, దేవుడు పితరునితో మరలా మాట్లాడి ఆయన "నేను బేతేలు దేవుడను" అని జ్ఞాపకము చేసి మరియు యాకోబు హారానును వీడి తాను జన్మించిన దేశమునకు వెళ్లుటకు సమయము వచ్చినదని చెప్పాడు (31:13).

యాకోబు కనానులో కొంత కాలము ఉన్నప్పటికీ కూడా, బేతేలునకు వచ్చుటకు కొంత తడవు చేశాడు. షెకెము వద్ద దేవుడు పితరునికి ప్రత్యక్షమై "నీవు లేచి బేతేలునకు వెళ్లి అక్కడ నివసించి, నీ సహోదరుడైన ఏశావు ఎదుట నుండి నీవు పారిపోయినప్పుడు నీకు కనబడిన దేవునికి అక్కడ బలిపీఠమును కట్టుమని" చెప్పాడు (35:1). దేవుని వెంబడించులాగున యాకోబు తీసుకున్న ప్రతిజ్ఞ ఆయన విగ్రహారాధన నుండి పూర్తి దూరంగా ఉండునట్లు కోరింది. ఆయనగాని లేదా ఆయన అనుచరగణంలోని ఇతరులుగాని అన్య బలిపీఠముపై ఆరాధించడం లేదా అన్య దేవతలతో పొందిక ఉండటం చేయకూడదు. అటువంటి క్రియలు యెహోవాకు అంగీకారములు కావు.

పలుమార్లు దేవుని ప్రజల విషయమైన విచారకరమైన ఉదంతం ఏమంటే యాకోబు చేసినదానిని పునరావృతం చేయడమే: అబ్రాహాము మరియు ఇస్సాకు దేవుడైన యెహోవాకు నమ్మకస్తులుగా ఉండుటకు చాలామంది ప్రమాణము చేసుకొని ఉంటారు కాని ఆయన పట్ల విధేయులమై ఉంటామని వారు చేసుకున్న ప్రతిజ్ఞలను మర్చిపోవడమో లేదా వాయిదా వేయడమో చేస్తూ ఉంటారు. దీనికి ఉదాహరణ ఒకదానిని నిర్గమకాండము 24:1-8లో, మోషే సీనాయి పర్వతముపై నుండి దిగివచ్చి యెహోవా యొక్క మాటలను మరియు ఆయన విధులను ప్రజలకు వివరిస్తుండగా, చూడగలం.దీనికి స్పందిస్తూ ఇశ్రాయేలీయులు "యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదము" అని చెప్పారు (నిర్గమ. 24:3). ఆ పిమ్మట దహన బలునలు (పరిహారము నిమిత్తము, లేవీ. 1:1-9) మరియు సమాధాన బాలులను అర్పించిన తరువాత మోషే నిబంధనా గ్రంథమును తీసుకొని ప్రజలకు దానిని చదివి వినిపించాడు. మరలా వారు "యెహోవా చెప్పినవన్ని చేయుచు విధేయులమై యుందుము" అని దృఢముగా తెలిపిరి (నిర్గమ. 24:7). కాని, వారి నిబద్ధత తరచూ సూర్యోదయముతో మాయమయ్యే ఉదయపు

మంచులా ఉండేది (హోషేయ 6:4). పది ఆజ్ఞలు వ్రాయబడియున్న రాతి పలకలను అందుకొనుటకు మోషే సీనాయి పర్వతముపై ఇంకను ఉన్నప్పుడు, ప్రజలు పోతపోయబడిన ఒక దూడకు సాష్టాంగపడి ఆరాధించారు. మానవుడు సృష్టించిన ఒక ప్రతిమను ఐగుప్తు దేశమునుండి వారిని విడిపించిన దేవునిగా వారు అంగీకరించారు (నిర్గమ. 32:4, 8).

తరువాతి సంవత్సరములలో, ఇశ్రాయేలీయులలో కొరవడిన విశ్వాసము, వారిలో ఉన్న అవిధేయత, విగ్రాహారాధన మరియు దేవునిపై తిరుగుబాటులను బట్టి కీర్తనాకారుడు విలపించాడు. వారి పాపములకు ఇయ్యబడిన మూల కారణం ఏమంటే దేవుడు చేసిన మహాత్కార్యములను వారు మర్చిపోవడం (కీర్తన. 78:7-11; 106:7-14, 19-22). అబ్రాహాము మరియు ఇస్సాకులకు దేవునిగా తన తండ్రిని మరియు తాతను ఆశీర్వదించిన రీతిగానే ఆయనను కూడా ఆశీర్వదిస్తానని దేవుడు యాకోబుకు జ్ఞాపకము చేశాడు. ఇంకా, తన ప్రయాణములో ఆయనతో ఉంది సురక్షితముగా ఆయనను తిరిగి ఇంటిక రప్పిస్తానని దేవుడు యాకోబుకు వాగ్దానము చేశాడు. అయినప్పటికీ, బేతేలునకు వెళ్లి దేవుని ఆరాధించాలని అనుకుంటే యాకోబు తన ప్రమాణమును నెరవేర్చవలసి ఉంది (28:13-15; 31:13; 35:1).

ఇటువంటి సవాలే ఒకటి క్రొత్తనిబంధనలో కూడా స్పష్టంగా కనబడుతుంది. దరిదాపుగా రెండు పూర్తి అధ్యాయములు, హెబ్రీ పత్రిక 3 మరియు 4 అధ్యాయములు, క్రైస్తువులను తడవుచేయుటను గూర్చి, అవిశ్వాసమును గూర్చి మరియు దేవుని పట్ల అవిధేయతలను గూర్చి హెచ్చరిస్తున్నాయి. పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలీయులు చేసిన ఆ తప్పులనే చేయకుండా జాగ్రత్త పడాలని రచయిత సహోదరులను హెచ్చరిస్తున్నాడు. ఆయన కీర్తనకారుని మాటలలో వారిని బ్రతిమాలుకున్నాడు, ". . . – నేడు మీరాయన శబ్దమును వినినయెడల, అరణ్యములో [ఇశ్రాయేలు] శోధన దినమందు [దేవునికి] కోపము పుట్టించినప్పటివలె మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (హెబ్రీ. 3:7, 8). దేవుని ప్రజలు తడవు చేసి "విశ్వాసములేని దుష్టహృదయము"ను పెంచుకొనకూడదు. అట్టి ఒక లేమి నిజంగా విషాదకరంగా ఉంటుంది, అది వారిని అవిధేయతకు మరియు దేవుడు అనుగ్రహించే పరలోకపు విశ్రాంతిలోనికి ప్రవేశించకుండా వారిని చేస్తుంది (హెబ్రీ. 3:11, 12, 18).

క్రైస్తవ గుణములోని వాస్తవికమైన లక్షణములను అలవరచుకొనలేని కొంతమంది దేవుని ప్రజలను పేతురు "గ్రుడ్డివాడును దూరదృష్టిలేనివాడును" అని మాట్లాడుతున్నాడు. తన "పూర్వపాపములకు" శుద్ధి ఎలా కలిగిందో వారు "మరచిపోయి" ఉన్నారు గనుక వారి ఆత్మీయ జీవితము మోడుబారినది (2 పేతురు 1:8, 9). దేవుని యొక్క "పిలుపును ఏర్పాటును" గూర్చిన ఆశీర్వాదమును వారు మరచిపోయారు. "ఎప్పుడును తొట్రిల్లకుండా" ఉండాలంటే "ఇట్టి క్రియలు చేయువారై" ఉండాలని అపొస్తలుడు వారిని హెచ్చరించాడు

(2 పేతురు. 1:10, ESV). వారు తమ రక్షణను కోల్పోవాలని ఆయన అనుకోలేదు.

మర్చిపోవుట మరియు విధేయత చూపుటకు తడవు చేయుట అనే యాకోబు యొక్క సమస్యను పేతురు మాట్లాడుతున్నా సమస్యలను పోలినవిగానే ఉన్నాయి. ఆయన బేతేలునకు తిరిగి రావాలని దేవుడు యాకోబుకు ఎందుకు జ్ఞాపకము చేశాడంటే, తను విధేయతను వాయిదా వేయడం వలన అసలు ఆయనను దేవుడు ఎందుకు పిలిచాడో ఎందుకు ఆశీర్వదించాడో అనే విషయాన్ని మర్చిపోయే ప్రమాదంలో యాకోబు తనను తాను నెట్టుకుంటున్నాడు. దేవునితో ఆయన చేసిన ప్రమాణమును నేరవేర్చుటలో తాను కనబరుస్తున్న లెక్కలేని విధానమును బట్టి, తన కుటుంబము ముందు ఆయన ఒక చెడ్డ మాదిరిని ఉంచుతున్నాడు. దేవుని సేవించే విషయమై తన నిబద్ధత విషయంలో యాకోబు కొంతమేర శ్రద్ధగా ఉండాలి.

*మనలను మనము శుచిపరచుకొని దేవుడిని మాత్రమే ఆరాధించాలి.* దేవుడు యాకోబును నలుగురు భార్యలతో, పండ్రెండ్రుగురు పిల్లలతో,[9] జంతువుల గొప్ప సంపదతో, మరియు వాటిని మేపుటకు అనేక దాసిదాసులతో సమృద్ధిగా ఆశీర్వదించాడు. కాగా, పితరుడు ఏదో యోగ్యుడు గనుక వీటినన్నిటిని పొందుకోనలేదు; దీనికి విరుద్ధంగా, తనలో చాలా పొరపాట్లు మరియు పాపములు ఉన్నప్పటికీ కూడా దేవుడు ఆయనను ఆశీర్వదించాడు. దేవుని చూపుతున్న కరుణకు బదులుగా యాకోబు తన పిల్లలకు ఏకైన నిజదేవుని గూర్చి వారికి బోధిస్తూ ఆయనకు అంగీకారయోగ్యమైన ఆరాధన ఎలా చేయాలో బోధించవలసి ఉన్నాడు. ఈ పనులను జరిగించుటలో యాకోబు నిర్లక్ష్యం చేసిన వాడిగా లేదా విఫలమైనవాడిగా ఆదికాండపు వాక్యభాగము చెప్తుంది.

తల్లిదండ్రులు, ముఖ్యంగా తండ్రులు, వారి పిల్లల ముందు మంచి మాదిరిని ఉంచి దేవుని గూర్చి వారికి ఉపదేశించవలసిన బాధ్యత ఎలాగైనా వారిపై ఉంది. పౌలు తండ్రులతో తమ పిల్లలను "ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" అని హెచ్చరిస్తున్నాడు (ఎఫెసీ. 6:4; కొలస్సీ. 3:21 చూడండి). పిల్లలను పెంచడంలో తల్లులు కూడా ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తారు అనుకోండి; కాని తండ్రులు ఈ విషయంలో బలహీనంగా ఉంటూ లేదా ఇళ్లలో ఉండకుండా దూరంగా ఉంటుంటే, కుమారులు దూరంగా పైదొలగిపోయి అసాంఘిక కార్యములలో పాల్గొనడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది.

దేవుని పిలుపుకు స్పందిస్తూ యాకోబు తన కుటుంబము వారితో "మిమ్మును మీరు శుచిపరచుకొని మీ వస్త్రములను మార్చుకొనుడి" అని ఆజ్ఞాపించాడు (35:2). శరీరమును శుచి పరచుకొని వస్త్రములను మార్చుకోవడం అనే విధానం దేవుని సన్నిధిలో ప్రవేశమునకు సిద్ధపరచచడానికి మరియు/లేదా సీనాయి పర్వతము దగ్గర ఇశ్రాయేలునకు జరిగినట్లుగా (నిర్గమ. 19:10-15) ఒకరి జీవితములో నూతన ఆరంభాన్ని చేయడానికి ఒక దృష్టాంతముగా ఉంది.

సాదృశ్యకముగా మాట్లాడాలంటే, పాపము అనునది మనలను అపవిత్ర పరచి దేవునిచే కడుగబడవలసిన ఒక మురికిగా ఉంది (కీర్తన. 51:2, 7; యెషయా 1:16; 2 కొరింథీ. 7:1; 1 యోహాను 1:9). మన పాత వస్త్రములు అనునవి చెడ్డ ప్రవర్తనలతోను మరియు కార్యములతోను కూడుకున్న మన పాత పాపపు జీవితమునకు సంక్షేపముగా ఉన్నాయి. మన నీతి యావత్తు దయనీయంగా ప్రాముఖ్యతలేనిది; అత్యంత పరిశుద్ధమైన దేవుని సన్నిధిలో మనము మురికి గుడ్డలను ధరించి నిలుచున్నట్లుగా అది ఉంది (యెషయా 64:6). ఆయన కృప వలన, దేవుడు మనకు నూతన వస్త్రములను ఇచ్చి ఒక తాజాకరమైన ఆత్మీయ ఆరంభమును ఇస్తున్నాడు. దేవునికి స్తుతి చెల్లిస్తూ యెషయా అంటున్నాడు,

> . . . శృంగారమైనపాగా ధరించుకొనిన పెండ్లికుమారుని రీతిగాను
> ఆభరణములతో అలంకరించుకొనిన పెండ్లికుమార్తె రీతిగాను
> ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింపజేసియున్నాడు
> నీతి అను పైబట్టను నాకు ధరింపజేసియున్నాడు . . .
> (యెషయా 61:10; జెకర్యా 3:1-5 చూడండి).

క్షమాపణను మరియు నూతన ఆరంభమును సూచించే నూతన వస్త్రములను ధరించుకొనుట అనే దృష్టాంతము క్రొత్తనిబంధనలో కూడా ప్రసిద్ధమైనదే (లూకా 15:22; ప్రకటన 3:18). ఒక పాపి దేవుని బిడ్డగా మారి క్రీస్తును ధరించుకొనును (గలతీ. 3:26, 27) అని తెలిపే విశ్వాసము మరియు క్రీస్తులో బాప్తిస్మము పొందడం అనే అంశాలకు సంబంధించి పౌలు వీటిని విశదపరచాడు. ఆత్మీయ అర్థంలో, ఒక వ్యక్తి ఆయన నీతి అనే వస్త్రమును ధరించుకున్నాడు (2 కొరింథీ. 5:17, 21). యెషయా ప్రయోగించిన దృష్టాంతమునే ప్రయోగిస్తూ, సంఘము నీటి (బాప్తిస్మము) ద్వారా కడుగబడి, పరిశుద్ధపరచబడి, శుభ్రపరచబడిన క్రీస్తు యొక్క వధువు అని పౌలు మాట్లాడుతున్నాడు. గొఱ్ఱెపిల్ల యొక్క పెండ్లి విందు జరిగినప్పుడు, సంఘమును దేవుడు తన మహిమను ధరించినదానిగాను, కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైన వస్త్రములను ధరించుకొన్నదానిగాను (ఎఫెసీ. 5:25-27; ప్రకటన 19:7-9) నిలువబెడతాడు.

*మనము దేవుని సేవించగల స్థలమునకు వెళ్లుట.* ఆరాధన మరియు దైవిక సేవ అనే విషయాలపై చేసుకున్న తీర్మానములను నిలబెట్టుకొనేవారిపై దేవుని యొక్క ఆశీర్వాదములు ఉంటాయి. షిమ్యోను మరియు లేవీ అనువారు షెకెము మనుష్యులను దారుణంగా హత్యచేసి ఆ పట్టణమును దోచుకున్న తరువాత, కనానీయులు మిక్కిలి బలమైన బలగముతో కూడి తనను మరియు తన సేవకులను, వారి అనుచరగణం అంతయు నశించేలాగున, వారిపై దాడి చేస్తారని యాకోబు చాలా భయపడిపోయాడు (34:30). బేతేలునకు వెళ్లకుండా ఇంకా ఎక్కువ తడవు చేయలేడని పితరునికి తెలుసు. ఆయన తన ప్రమాణమును

ఇప్పుడు తప్పక నెరవేర్చాలి, బలిపీఠమును కట్టాలి, మరియు దేవుని ఆరాధించాలి. కాబట్టి, ఆయన మరియు ఆయన అనుచరగణం వారు దక్షిణ మార్గమున వారి ప్రయాణమును సాగించి దేవుని ఎదుర్కొనుటకు ముందుగా అనుకున్న ఒక స్థలమునకు వెళ్లారు. తనకున్న భయములకు అతీతంగా, ప్రకాశమానమైన భవిష్యత్తుకు మార్గము బేతేలునకు మరియు దేవుని దగ్గరకు వెళ్లడం అని యాకోబుకు తెలుసు. తనను మరియు తన ప్రజలను ఆపద నుండి రక్షించి తన ప్రయాణమును సఫలము చేయులాగున దేవునిపై ఆధారపడవలసి ఉంది (28:15). అదే ఖచ్చితంగా ఇక్కడ జరిగింది. 35:5 ప్రకారం, దేవుని "భయము" వారి చుట్టున్న పట్టణములపై పడెను గనుక వారు యాకోబు కుటుంబంపై దాడి చేయలేదు.

ఇటువంటి భయము మరియు ఆందోళనే ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచి అరణ్య మార్గము గుండా వాగ్దాన దేశమునకు వెళ్తున్నప్పుడు వారికి ముందుగా వెళ్ళింది. చ చుట్టున్న దేశములు వారిపై దాడి చేయలేదు; బదులుగా, వారు దిగులొంది కరిగిపోయారు (నిర్గమ. 15:13-16). హెష్బోను రాజైన సీహోను కనానులో ఇశ్రాయేలీయుల మార్గమును అడ్డుకున్నప్పుడు, దేవుడు ఇశ్రాయేలీయులను గూర్చిన "భయము మరియు వెరపు"ను ఇశ్రాయేలీయులు జయించులాగున ప్రజలందరిపై ఉంచాడు (ద్వితీ. 2:24, 25). కనాను దేశము యొక్క ఆక్రమణ ప్రారంభమైనప్పుడు, "యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాదనియు, మీవలన మాకు భయము పుట్టుననియు, మీ భయమువలన ఈ దేశనివాసులాందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును" అని పలికి యెరికోలో ఇశ్రాయేలీ వేగులవారికి రాహాబు భద్రతనిచ్చింది (యెహోషువ 2:9).

దేవుని ప్రజలు ఇంకనూ కష్టములను ఎదుర్కొన్నారు; కాని ఇశ్రాయేలునకు దేవుని యొక్క విశిష్టమైన వాగ్దానము ఉంది, అది మొదట అబ్రాహామునకు ఇయ్యబడింది, అదేమనగా ఆకాశ నక్షత్రముల వలె ఆయన సంతానము వృద్ధి పొందుతారు. నాలుగు వందల సంవత్సరాల అణచివేత మరియు బానిసత్వము తరువాత, వారిని బయటకు రప్పించి వాగ్దాన దేశమునకు తీసుకువెళ్లి అక్కడ వారిని స్థిరపరుస్తానని దేవుడు ఆయనకు చెప్పాడు (15:5-7, 13-21). దేవుడు వారికి కనాను దేశమును ఇచ్చిన తరువాత కూడా, వారికి మంచి సమయములు చెడు సమయములు, జయములు అపజయములు ఉన్నాయి. దేవుడు ఎప్పుడు వారిని ఆశీర్వదించాలనే అనుకున్నాడు, కాని ఆయనపై తిరుగుబాటు చేయడం ద్వారా వారు తమపై శ్రమను మరణమును తెచ్చుకున్నారు.

అనేక కారణముల వలన బాధ అనునది ఈ లోకంలోని మంచివారిపైనా మరియు చెడ్డవారిపైనా కూడా వస్తుంది. (1) మూలమైన వివరణ ఏమంటే ఆదాము మరియు హవ్వలు బయటకు త్రోలివేయబడినప్పుడు ఏదేను తోటలో ప్రారంభమైన పాపము మరియు మరణముల నుండి మినహాయించబడేవారు

ఎవరు లేని ప్రపంచంలో మనము జీవిస్తున్నాము (2:15-17; 3:23, 24). "కడబూర" శబ్దము చేయబడి "విజయమందు మరణము మ్రింగబడే" వరకు కూడా ఈ ఒడిదుడుకులు మానవ పరిస్థితుల్లో భాగముగానే ఉంటాయి (1 కొరింథీ. 15:50-58). (2) కొన్నిసార్లు దుఃఖములు అనేవి భూకంపము, తుఫాను మరియు వరదల వంటి ప్రకృతి వైపరీత్యముల వలన వస్తుంటాయి. మనకున్న పరిమిత జ్ఞానము మరియు శక్తుల వలన అట్టి శక్తులను మనము ఆపలేము. (3) కొన్నిసార్లు దుఃఖము అనునది ప్రమాదవశాత్తు జరుగుతుంటుంది. మనము వాహనము నడుపుతున్నప్పుడో లేకా ఏదైనా యంత్రముతో పనిచేస్తున్నప్పుడో మనము తీసుకునే తప్పుడు లేదా నిర్లక్ష్యమైన – కాని పాపములు కావలసిన అవసరత లేదు – నిర్ణయాల వలన వస్తుంటుంది. (4) బాధ మరియు దుఃఖము అనునవి ఇతరుల క్రియల వలన, అవి ఉద్దేశపూర్వాకంగా చేసినా లేదా అనుకోకుండా చేసినా, వస్తుంటాయి. (5) స్వార్థపూరితమైన ఆశలు మరియు అలవాట్లు, అవి మనపైనా లేదా మన చుట్టూ ఉన్నవారిపైనా, నిగ్రహములో ఉండకపోతే అవి వినాశనమును చేస్తాయి.

రేపటిని గూర్చిన వాగ్దానము మనకు లేదు; కాని కొన్నిసార్లు దేవుడు యాకోబునకును మరియు ఇశ్రాయేలు దేశమునకును చేసినట్లుగా తన ప్రజలను కాపాడుటకు మరియు తన వాగ్దానములను నెరవేర్చుటకుసున్నితమైన మరియు నాటకీయ విధానాలలో చొరవ తీసుకుంటాడు. పరిశుద్ధ గ్రంథంలో కూడా, ఇవన్నియు కూడా ఒక నిబంధనగా లేవు కాని దేవునికి ఐచ్చికంగా ఉన్నాయి. తాను అప్పగింపబడిన రాత్రి యేసు తన శిష్యులతో అన్నాడు, "లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాను" అని చెప్పాడు (యోహాను 16:33). దేవుడు గొప్ప ఆజ్ఞను (మత్తయి. 28:18-20; మార్కు 16:15, 16) ఇచ్చిన ప్రతి శిష్యుడు కూడా, యోహాను మినహా, హతసాక్షులుగావించబడినట్లుగా నమ్మబడుతుంది. ఖచ్చితంగా, మంచివారికి చెడు జరుగుతుంది అని ఇది మనకు వెల్లడి చేస్తుంది. అత్యంత పరిశుద్ధులు తరచుగా అత్యంత శ్రమననుభవించిన వారు. ప్రపంచము చూసినంతలో యేసు అత్యంత సుందరమైన జీవితాన్ని జీవించాడు, కాని ఆయనను రోమా సిలువపై మేకులతో బంధించే ముందు భయంకరమైన కొరడా దెబ్బలను మరియు దూషణను సైనికుల చేతులనుండి అనుభవించాడు. తన ప్రజలందరికి ఉమ్మడిగా దేవుడు అప్పుడు ఆశీర్వాదములను వాగ్దానము చేశాడు, అలాగే యాకోబు వంటి వ్యక్తులకు కూడా; కాని హృదయ వేదనలు మరియు జీవితములో బాధలు ఉండవని మాత్రం ఎవరికీ మాట ఇవ్వలేదు.

యాకోబు బేతేలునకు తిరిగి వచ్చినప్పుడు, అక్కడ ఒక బలిపీఠమును కట్టి దేవుని ఆరాధించి, ఆ స్థలమునకు "ఎల్-బేతేలు," అనగా "బేతేలు దేవుడు" అని నామకరణం చేశాడు (35:7). ఈ గొప్ప క్షణం తరువాత, "రిబ్కా దాదియైన దెబోరా మరణించెను" (35:8) అని తరువాతి వచనము చెప్తుంది. విశ్వాసముగల ఈ స్త్రీ,

యాకోబు తల్లికి దాది, ఈ పితరుడు చిన్నవానిగా ఉన్నప్పుడు ఈయనకు కూడా దాదిగానే ఉండియుంటుంది. తన కుటుంబములో పెద్దవయసు కలిగిన వ్యక్తిగా ఆమెను ప్రేమించి ఉంటాడు, కాబట్టి ఆమె యొక్క మరణము ఖచ్చితముగా ఆయనకు నిజమైన విచారమును కలిగించి ఉంటుంది.

ఈ నష్టమును గూర్చి విచారపడిన తరువాత, దేవుడు యాకోబుకు మరలా ప్రత్యక్షమవ్వడం ద్వారా తన ఆత్మను ఉజ్జీవింపచేశాడు. పితరులకు ఇచ్చిన ఆశీర్వాదమును నూతనపరచి తన పేరును "యాకోబు" నుండి "ఇశ్రాయేలు"నకు మార్చాడు (35:10). ఈ సమావేశంలో, దేవుడు తనను తాను "సర్వశక్తిగల దేవుని"గా (אֵל שַׁדַּי, *'El Shadday*), అంటే ఆయన అబ్రాహామునకు అగుపడిన ఆ పేరును (17:1) మరియు 28:3లో ఇస్సాకు వాడిన పేరును, సంబోధించాడు. దీనికి తోడు, దేశమును గూర్చిన వాగ్దానమును పునరుద్ఘాటించి యాకోబు (ఇశ్రాయేలు) గర్భవాసము నుండి జనములును, జనముల సమూహమును, రాజులును వస్తారని చెప్పాడు (35:11, 12). దైవప్రత్యక్షత ముగిసినప్పుడు, యాకోబు ఒక రాతిస్తంభమును నిలిపి దానిపై పానార్పణమును మరియు నూనెను పోసాడు (35:14). రెండవ సారి ఆ స్థలమును ఆయన "బేతేలు," అనగా "దేవుని యిల్లు" అని పిలిచాడు (35:15; 28:17 చూడండి).

దక్షిణ దిశగా, బేతేలు మరియు బేత్లెహేము మధ్య కొంత భాగములో,వారి అనుచరగణం కొనసాగుతుండగా రాహేలు తీవ్రమైన ప్రసవవేదన పడి యాకోబు కనిష్ట కుమారుడైన బెన్యామీనుకు జన్మనిస్తూ మరణించింది. మరొకసారి, పితరునిపై మరియు ఆయన కుటుంబముపై దేవుడు పలికిన ఆశీర్వాదము వారిని విషాదమునుండి మినహాయించలేదు. మరణములో యాకోబు తనకు ప్రియమైన భార్యను కోల్పోయాడు.

దేవుని ఆశీర్వాదములు దుఃఖములు లేని జీవితమును మనకు వాగ్దానము చేయవు; కాని, దేవుని ప్రజలకు సందేశం ఏమంటే ఆయన ఎల్లప్పుడూ మనతో ఉంటాడు. మనలను దహించివేసే అగ్నివంటి శ్రమలు ఎన్ని ఉన్నప్పటికీ కూడా నడిపించే ఆయన కృప మనలను ఎత్తిపట్టుకుంటుంది. "[మీతో] కూడా ఎల్లప్పుడూ యుగసమాప్తి వరకు ఉంటాను" అని ఆయన మనకు వాగ్దానము చేశాడు (మత్తయి 28:20); "'నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను' అని ఆయనే చెప్పెను గదా" (హెబ్రీ. 13:5). దేవుడు మనతో ఉంటాడు, ఆదరిస్తాడు, బలపరుస్తాడు, మరియు తన చిత్తమును నెరవేర్చుటకు మనకు శక్తినిస్తాడు (2 తిమోతి 4:17; కీర్తన. 23 చూడండి).

## దేవుని ప్రేమించడం (35:1-4)

యాకోబు యొక్క సంతానమువారు ఒకవేళ వారు దేవుని ప్రేమించినట్లయితే, ఆయన మాటకు విధేయులైనవారైతే, మరియు ఆయనను వెన్నంటి ఉన్నవారైతే

గొప్ప ఆశీర్వాదములను అనుభవించేవారిగా ఉన్నారు. "నీ పితరులైన అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఆయన ప్రమాణము చేసిన దేశములో మీరు నివసించునట్లు యెహోవాయే నీ ప్రాణమునకును నీ దీర్ఘాయుష్షుకును మూలమైయున్నాడు . . ." అని ద్వితీయోపదేశకాండము 30:20 చెప్తుంది. ఆ సందర్భంలో, అరణ్యములో నలుబది సంవత్సరముల తరువాత, ఇశ్రాయేలీయులలో తరువాతి సంతానమునకు మోషే తమ దేవుడైన యెహోవాను పూర్ణ హృదయముతో, ఆత్మతో, బలముతో ప్రేమించాలని ఆజ్ఞాపిస్తున్నాడు. యెహోవా యొక్క ఆజ్ఞలను వారు పగలును రాత్రియును తమ పిల్లలకు బోధించాలి, ఆయనను మాత్రమే పూజించి ఆరాధించాలని వారికి బోధించాలి (ద్వితీ. 6:5-7, 13, 14). మోషే మరణించుటకు ఎక్కువ కాలము కాకమునుపు, ఆయన ఇశ్రాయేలీయుల ముందు "మరణమును జీవమును, ఆశీర్వాదమును శాపమును" ఉంచి ఉన్నాను అని జ్ఞాపకము చేశాడు; మరియు వారు బ్రదుకునట్లుగా "జీవమును కోరుకొనుడి" అని వారిని బ్రతిమాలుకున్నాడు (ద్వితీ. 30:19).

సాధారణంగా, పాటించాలని మోషే ఆజ్ఞాపించినవాటిని ప్రజలు అయితే తిరస్కరించారు లేదా నిర్లక్ష్యం చేశారు. 78వ కీర్తనలో ఉన్న ఒక ప్రసంగం ఇశ్రాయేలీయుల చరిత్రలో చాలా భాగము వారిని పీడించిన సమస్యలను మనకు బయలుపరుస్తుంది. కీర్తన ఆరంభంలో, ప్రసంగి దేవుడు చేసిన మహాత్కార్యములకును మరియు తన ప్రజలకు ఒక మార్గదర్శిగా దేవుడు స్థిరపరచిన మోషే ధర్మశాస్త్రమును గురించి ఉద్ఘాటించాడు. ఈ విషయములను "తమ పిల్లలకు" బోధించవలసినదిగా కీర్తనాకారుడు ఉద్ఘాటించాడు, తద్వారా వారు "దేవునియందు నిరీక్షణగలవారై" ఉంటారు (కీర్తన. 78:4-7). వారు "మూర్ఖతయు తిరుగుబాటును" కలిగి వారి హృదయములను మరియు ఆత్మలను "దేవునికి నమ్మకముగా" సిద్ధపరచుటకుగాను నిరాకరించిన "ఆ తరమును పోలియుండక" ఉండుమని ఆయన హెచ్చరించాడు (కీర్తన. 78:8). అరణ్యములో ఇశ్రాయేలు చేసిన పాపములను గురించి ప్రస్తావించిన తరువాత, "ప్రతిష్టించిన దేశము"నకు తన ధ్యాసను త్రిప్పాడు (కీర్తన. 78:54), అక్కడ వారు తమ పితరులు చాలా ఆలస్యంగా నేర్చుకున్న పాఠములను మర్చిపోయారు. దేవుని ప్రజలపై అనేక ఆరోపణలను చేస్తూ, వారు "మహోన్నతుడైన దేవుని శోధించి" మరియు "ఉన్నతస్థలములను కట్టి ఆయనకు కోపము పుట్టించిరి మరియు విగ్రహములను పెట్టుకొని . . . " అని రచయిత అంటాడు (కీర్తన. 78:56-58).

ఈ కీర్తనలో తెలుపబడిన అనేక పాపములు మరియు సమస్యలు యాకోబు జీవితములో కూడా లక్షణములుగా ఉన్నాయి: ఏశావు యొక్క జ్యేష్ఠత్వపు హక్కును మరియు మరణపడక ఆశీర్వాదమును దొంగిలించుటలో ఆయన యొక్క స్వార్థపరుడు మరియు మనసాక్షిలేనివానిగా ఉన్నాడు, మరియు తన సహోదరునికి మరియు తన తండ్రికి తన కపటము మరియు మాయ ద్వారా

కలిగించిన బాధ పట్ల ఆయన అసలు చలనము లేనివాడిగా ఉన్నాడు. తన యెడల తన తల్లి చూపుతున్న పక్షపాతము వలన తన కుటుంబములో వచ్చిన విభేదాలను బట్టి ఆయన పట్టనట్లుగా ఉన్నాడు. యాకోబు అసత్య దేవతలను ఆరాధించాడని అనుటకు మనకు ఎటువంటి ఆధారము లేనప్పటికీ కూడా, తన జీవితములో ఎక్కువ భాగముమేర తన హృదయములో దేవునికి మొదటి స్థానము ఇచ్చినవానిగా మాత్రం కనబడడు. ప్రధానంగా సంక్లిష్టమైన సందర్భాలలోనే ఆయన దేవుని వేడుకున్నవానిగా ఉన్నాడు. ఒకసారి ఆయన ఏశావుతో సమాధానపడిన తరువాత, కొంతకాలము పాటు తన కుటుంబమును సుక్కోతులో ఆ తరువాత షెకెములో స్థిరపరచాడు. తన కుమార్తెయైన దీనా బలాత్కారము చేయబడినప్పుడు, ఆయన కోపోద్రేక్తుడు కాలేదు కాని నిశ్చేష్టుడిగా ఉన్నాడు; హామోరు మరియు షెకెము తెచ్చిన వివాహ సంబంధము విషయంలో ఆయన ఎటువంటి చొరవను చూపలేదు. ఈ సంవత్సరముల అన్నిటి తరువాత, యాకోబు స్పష్టంగా తన కుమారులపై తన ప్రభావాన్ని మరియు ఆధీనాన్ని కోల్పోయాడు. ఖచ్చితంగా, తన చేతినుండి వచ్చే క్రమశిక్షణకు వారు భయపడలేదు, మరియు సహజంగానే వారు ఆయన పట్ల తమ గౌరవాన్ని కూడా కోల్పోయే ఉంటారు.

ఆఖరుగా పితరుడు అధికారము తీసుకుని తన కుటుంబమునకు మరియు తన దాసులకు – అంటే షెకెము నుండి వచ్చిన బందీలతో సహా – దేవుడు ఆయనకు ఏమి వాగ్దానము చేశాడో ఇంకా ఏమేమి కార్యములు చేశాడో చెప్పడం 35వ అధ్యాయంలో చూడటం చాలా మంచిగా ఉంది. యాకోబులో వచ్చిన ఈ మార్పుతో, ఏకైక నిజదేవునితో సరియైన సంబంధమును కలిగి ఉండుటకు గాను ఒక నూతనమైన ఆరంభాన్ని చేయవలసినదిగా తన కుటుంబమును కోరాడు. అసత్య దేవతలను వారు పరిత్యజించి, తమను తాము శుచిపరచుకొని, దేవుని ఆరాధించుటకును మరియు యోగ్యకరముగా ఆయనను సేవించుటకును నూతనమైన వస్త్రములను ధరించవలసినదిగా ఉన్నారు (35:2). వారు బేతేలునకు వెళ్లి అక్కడ దేవునికి, అనగా తన వేదనకాలంలో తనతో ఉంది ఇన్ని సంవత్సరములుగా తను ఎక్కడికి వెళితే అక్కడ తనతో తోడుగా ఉన్న దేవునికి (35:3), ఒక బలిపీఠమును నిర్మించుటకు మునుపు ఈ కార్యములన్నియు అనివార్యములు అని యాకోబు వక్కాణించాడు. అట్టి సుదీర్ఘకాలమునకు దేవుడు ఇచ్చిన ఆశీర్వాదములు మరియు విశ్వాస్యతను గూర్చిన ఈ సాక్ష్యము యాకోబు అనుచరగణంలో ఉన్న వారిని సహకరించి తమవద్దనున్న విగ్రహములను పారవేయుటకు పురికొల్పాయి (35:4). వారు ఇప్పుడు బేతేలునకు మిగిలిన ప్రయాణము కొరకు సిద్ధముగా ఉన్నారు.

## సూచనలు

[1]తన కుమారుని బలిగా అర్పించమని దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన ఆజ్ఞ (22:2) బలిపీఠమును నిర్మించుటను సూచిస్తుంది. అయినప్పటికీ, బలిపీఠమును నిర్మించవలసినదిగా ఈ వాక్యములో ఆజ్ఞ ఇయ్యబడినట్లు ఎక్కడా లేదు. [2]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 324. [3]బెన్యామీను ప్రాంతంలో సెల్సాలో రాహేలు పాతిపెట్టబడింది గనుక, బేత్లెహేమునకు కొంచెం వెలుపల తన సమాధి ఉన్నట్లుగా చెపుతున్న పారంపర్యాచారం వాస్తవం కాదు. [4]G. Herbert Livingston, "אָוֶן," in *TWOT*, 1:23 చూడండి. ఇటువంటి మరొక కథ కొరకు, 1 సమూ. 4:19–22 చూడండి. [5]Elmer A. Martens, "בִּנְיָמִין," in *TWOT*, 1:114. Martens అనే రచయిత "దక్షిణమునకు చెందిన కుమారుడు" అనే సాధ్యపడే అర్థాన్ని కూడా ఇస్తున్నారు. యాకోబు కుటుంబము దక్షిణ దిశ ప్రయాణంలో ఉన్నదని మరియు బెన్యామీను దక్షిణమున (హారానులో జన్మించిన తన మిగితా సహోదరులకు భిన్నంగా) జన్మించాడు అనే విషయాలకు తగినదిగా ఈ అర్థము ఉన్నది. అయినప్పటికీ, "కుడిచేతి పుత్రుడు" అనే అర్థము "దుఃఖ పుత్రుడు" అనే అర్థానికి సరాసరి వైబేధ్యంగా ఉంది. [6]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 372. [7]అలాగే, నాహోరు మరియు ఇష్మాయేలు కూడా చెరొక పండ్రెండ్రు మంది కుమారులను కన్నారు (22:20–24; 25:12–18). [8]34వ అధ్యాయములో దీనాపై బలాత్కారము తరువాత, ఆమె గురించిన మరొక ప్రస్తావన కేవలం 46:15లోనే ఉంది. ఆమె వివాహము చేసుకున్నదని లేదా బిడ్డలను కన్నదని ఏ వాక్యము చెప్పుటలేదు. తామారు చెరుపబడిన తరువాత ఉన్నట్లు (2 సమూ. 13:20) ఈమె కూడా అలాగే "ఉండిపోయి" ఉంటుంది. [9]యాకోబు మరియు అతని కుటుంబము షెకెమును విడచి (35:4) బేతేలు మరియు బేత్లెహేమునకు కొంత మధ్య భాగమున వచ్చినంతవరకు (35:16-19) కూడా బెన్యామీను పుట్టలేదు.